క్లుప్తంగా

విద్యుత్ వినియోగదారుల సదస్సు రద్దు

ములకలపల్లి: మండలకేంద్రంలోని సబ్‌స్టేషన్ ఆవరణలో నేడు (గురువారం) నిర్వహించనున్న విద్యుత్ వినియోగదారుల సదస్సు రద్దైనట్లు ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మీనర్సింహారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాలవల్ల రద్దయిన ఈ సదస్సు మరలా నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని ఏఈ పేర్కొన్నారు.

నేడు మణుగూరులో పొంగులేటి పర్యటన

బూర్గంపాడు: తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర ప్రచార కమిటీ కోకన్వీనర్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం మణుగూరులో పర్యటించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్యతో కలసి మణుగూరు హనుమాన్ ఫంక్షన్ హాల్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని తెలిపారు.

భద్రాచలం నియోజకవర్గంలో..

భద్రాచలంఅర్బన్: తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్, పార్టీ ఎన్నికల కమిటీ సభ్యుడు పొంగులేటి శ్రీనివాస రెడ్డి భద్రాచలం నియోజకవర్గంలో గురువారం పర్యటించనున్నారు. ఈ మేరకు భద్రాచలం మండల కాంగ్రెస్ అధ్యక్షులు సరెళ్ళ నరేష్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ పర్యటనలో భాగంగా ఉదయం 8 గంటలకు డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఇంటికి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేరుకుని అక్కడి నుంచి వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని, కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నరేష్ కోరారు.

సమావేశాన్ని జయప్రదం చేయాలి

అశ్వాపురం: నేడు మణుగూరులో గుట్టమల్లారం వద్ద హనుమాన్ ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే కాంగ్రెస్ పార్టీ పినపాక నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు ముత్తినేని శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో కోరారు. గురువారం జరిగే సమావేశానికి టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య హాజరవుతారని తోగ్గూడెం సమ్మక్క–సారక్క గుడి దగ్గర నుంచి బైక్ ర్యాలీ, సమావేశానికి మండలంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

భద్రాచలంటౌన్: విద్యారంగంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని యూఎస్‌పీసీ రాష్ట్ర నాయకుడు మునిగడప రామాచారి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీపీటీఎఫ్, యుటీఎఫ్, ఏపీఎఫ్ సంఘల నాయకుల ఆధ్వర్యంలో యుఎస్‌పీసీ మహాధర్నా పోస్టర్‌ను ఆయన బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. జూలై 2023 నుంచి తాత్కాలిక భృతి ప్రకటన, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని అన్నారు. విజయ్‌కుమార్, శ్రీనివాస్, రాజు, బాబురావు, శేఖర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మణుగూరురూరల్: మణుగూరు ఏరియాలోని ఓసీ–2 క్యాంటిన్‌లో కాంట్రాక్ట్ కార్మికురాలిగా పని చేస్తున్న పాల్వంచ రాణి ఇల్లు ఇటీవల జరిగిన షార్ట్ సర్క్యూట్ ప్రమాదంలో కాలిపోయింది. ఇద్దరు చిన్నపిల్లలతో బాధితురాలు తీవ్ర ఇబ్బందులు పడుతోంది. విషయం తెలుసుకున్న ఓసీ–2 సేఫ్టీ విభాగం ఉద్యోగులు రూ.1,00,800లను సేఫ్టీ సూపర్‌వైజర్ డి.కార్తీక్ చేతుల మీదుగా ఆర్థిక సహాయం అందించి ఔదార్యం చాటుకున్నారు. కార్యక్రమంలో సేఫ్టీ విభాగ ఉద్యోగులు పర్వేజ్ ఖాన్, ఉపేందర్, అరుణచారి, శేషగిరి, లింగమూర్తి, శ్రీనివాస్, నర్సయ్య, శ్రీను, పవన్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

దుమ్ముగూడెం: మండలంలోని కొత్తపల్లి ఏహెచ్‌ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సనప వెంకటేశ్వర్లు గుండె పోటుతో మృతి చెందాడు. బుధవారం ఉదయం గుండె పోటు రావడంతో భద్రాచలంలో ఓ ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించారు. పరిస్థితి విషమంగా మారి మధ్యాహ్నం మృతి చెందాడు. మృతదేహాన్ని ఉపాధ్యాయసంఘం నాయకులు సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ జిల్లా కమిటీ తరపున ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వెంకటేశ్వర్లు అకాల మరణం దురదృష్టకరమని సంఘం జిల్లా అధ్యక్షుడు బి.రాజు అన్నారు. వెంకటేశ్వర్లు భౌతికకాయానికి నివాళులర్పించిన వారిలో దుమ్ముగూడెం మండలం జనరల్ సెక్రెటరీ బి.రవి, కార్యదర్శి యల్.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం

అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని బుధవారం పలు రాజకీయ పార్టీలు, ఉద్యోగ సంఘాలు, ప్రజాసంఘాలకు చెందిన ఆదివాసీ నాయకులు ఘనంగా నిర్వహించారు. భారీ ప్రదర్శనలు, బైక్ ర్యాలీ, డప్పు, కొమ్ము నృత్యాలు చేస్తూ ప్రదర్శన చేపట్టారు. ఆదివాసీ జెండాలను ఎగురవేశారు. సభలు ఏర్పాటు చేసుకుని ప్రసంగించారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 1/70, పెసా, అటవీ హక్కుల చట్టాలు నిరాధరణకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసీలపై జరుగుతున్న దాడులపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. ఆదివాసీల ఉనికిని, చట్టాలను పరిరక్షించాలని కోరారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



చంద్రుగొండ: ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు



భద్రాచలంఅర్బన్: కొమరం భీం విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే పొదెం వీరయ్య



అశ్వారావుపేట: ఆదివాసీ దినోత్సవ ప్రదర్శనలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు



మణుగూరురూరల్: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



దుమ్ముగూడెం: బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న ఆదివాసీ నాయకులు



గుండాల: ఆళ్లపల్లిలో నినాదాలు చేస్తున్న ఆదివాసీ, ప్రజాసంఘాల నాయకులు



కరకగూడెం: జెండా ఎగరవేస్తున్న ఎంపీపీ రేగా కాళిక



చర్లలో సాగిన ర్యాలీ..



మణుగూరురూరల్: కొమరం భీంకు నివాళులర్పిస్తున్న నాగేశ్వరరావు



దమ్మపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాపంథా నాయకులు, కార్యకర్తలు



ములకలపల్లి: పతాకావిష్కరణ చేస్తున్న ఆదివాసీ జేఏసీ నాయకులు



అశ్వారావుపేటరూరల్: నారంవారిగూడెం కాలనీలో ఆదివాసీ దినోత్సవం..



అశ్వాపురం: ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ర్యాలీ..

విధుల్లో చేరని తహసీల్దార్

అశ్వాపురం: జిల్లాలో ఈ నెల 2న తహసీల్దార్‌ల బదిలీలు జరిగాయి. అశ్వాపురం తహసీల్దార్ ఎం రాజును ఖమ్మం జిల్లాకు బదిలీ చేయగా గుండాల తహసీల్దార్ నాగదివ్యను అశ్వాపురం తహసీల్దార్‌గా బదిలీ చేశారు. వారం రోజులు గడిచినా తహసీల్దార్ నాగదివ్య విధుల్లో చేరలేదు.

ఇన్‌చార్జ్ బాధ్యతలు కూడా ఎవరికీ అప్పగించలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గృహలక్ష్మి దరఖాస్తులకు గురువారంతో గడువు ముగుస్తుండడంతో మండల వ్యాప్తంగా అర్హులైన నిరుపేదలు వందల సంఖ్యలో కుల, ఆదాయ, నివాస ధృవీకరణపత్రాల కోసం దరఖాస్తులు చేస్తున్నారు. ఆదాయ ధ్రువీకరణపత్రాలు డిప్యూటీ తహసీల్దార్ జారీ చేస్తున్నారు. కానీ కుల, నివాస ధృవీకరణపత్రాలు వందల సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయి. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సాయంత్రానికి 215 కుల, 50 నివాస ధ్రువీకరణపత్రాలు పెండింగ్‌లో ఉండగా గురువారం రాత్రి వరకు 500 నుంచి 1000 ధృవీకరణపత్రాలు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసే అవకాశం ఉంది. విద్యార్థులు వారి చదువులకు కావాల్సిన ధ్రువపత్రాల కోసం ఇబ్బంది పడుతున్నారు. కలెక్టర్ స్పందించి తక్షణమే అశ్వాపురం తహసీల్దార్ విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని, కనీసం ఇన్‌చార్జ్ బాధ్యతలు ఎవరికైనా అప్పగించాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రీన్ భద్రాద్రి సేవలు అభినందనీయం



మొక్క నాటుతున్న ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్

భద్రాచలంఅర్బన్: పర్యావరణ పరిరక్షణ కోసం నిత్యం కృషి చేస్తున్న గ్రీన్ భద్రాద్రి వారి సేవలు అభినందయమని భద్రాచలం ఐటీడీఏ ప్రతీక్ జైన్ అన్నారు. బుధవారం స్థానిక గ్యాస్ గోడౌన్ పక్కన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మొక్క నాటి ప్రసంగించారు. కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి అధ్యక్షుడు బెల్లంకొండ రాంబాబు, ప్రధాన కార్యదర్శి శ్రీరంగం సంపత్, కోశాధికారి విష్ణుమొలకల సుబ్రహ్మణ్యం, గౌరవాధ్యక్షుడు పల్లింటి దేశప్ప, బోణాల నాగ సూర్యనారాయణ, కామిశెట్టి కృష్ణార్జునరావు, ఉపాధ్యక్షుడు ఏ.ఉమా శంకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు 'చేయూత'

బూర్గంపాడు: పాల్వంచ పీహెచ్‌సీలో వైద్యసేవలు పొందుతున్న సోంపల్లి జ్వర బాధితులకు మోరంపల్లి బంజర చేయూత ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం పండ్లు, బ్రెడ్స్ అందజేశారు. సోంపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో చికిత్సలు పొందుతున్న బాధితులకు కూడా పండ్లు, బ్రెడ్స్ అందజేశారు. ఇటీవల జ్వరంతో మృతిచెందిన పాందు లక్ష్మయ్య కుటుంబానికి 25 కిలోల బియ్యం, నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కైపు లక్ష్మీనారాయణరెడ్డి, మూల లక్ష్మీరెడ్డి, జక్కిరెడ్డి మల్లారెడ్డి, గాదె నర్సిరెడ్డి, చంటి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికులకు ఘన సన్మానం

మణుగూరురూరల్: భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు భారత సైన్యంలో పని చేసి ఉద్యోగ విరమణ చేసిన మాజీ సైనికులను బీజేపీ ఆధ్వర్యంలో పట్టణ పార్టీ కార్యాలయంలో నాయకులు బుధవారం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంపన సీతారామరాజు, జిల్లా కార్యదర్శి ముత్యాల వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు లింగంపల్లి రమేష్‌లు మాట్లాడుతూ.. భారతదేశ సైనికులు త్యాగాలు, సేవలు ఎన్నటికీ మరువలేనివన్నారు. కార్యక్రమంలో నాయకులు ఈసాల వెంకటేశ్వర్లు, ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, చిత్ర సరస్వతి, మెరుగు రవీంద్రనాథ్, దివ్యశ్రీ, రామచంద్రరాజు, వెంకట్ నాయక్, దుర్గారావు, శివప్రసాద్, సాయి, రమేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



మాజీ సైనికులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

అమ్మకాన్ని అడ్డుకోవాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని మనుబోతుల చెరువు కాలనీలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కొందరు అర్హత లేనివారికి అమ్మకానికి పెట్టారని ఆరోపిస్తూ స్థానిక నిరుపేదలు బుధవారం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ ప్రదేశంలో దీక్ష చేపట్టారు. ఈ ఇళ్ల నిర్మాణానికి ముందు 50 కుటుంబాలు గుడిసెలు వేసుకుంటే తహసీల్దార్ వారిని ఖాళీ చేయించాడని, ఇళ్లు పూర్తయ్యాక డబుల్ ఇళ్లు ఇస్తామని చెప్పారని అన్నారు. ఇప్పుడు మాత్రం అర్హత లేదంటూ అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అలవాల రాజా పెరియార్, సత్యనారాయణ, లత, హేమలత, సమ్మక్క, పార్వతి, కుమారి, కృష్ణవేణి, నిర్మలమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా మధు

కరకగూడెం: టీడీపీ పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా మండలంలోని చిరుమళ్ల గ్రామానికి చెందిన పార్టీ పినపాక నియోజకవర్గ సమన్వయకర్త చందా మధును ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ నియమించారు. ఈ మేరకు ఆయన బుధవారం అందుకు సంబంధించిన నియామక పత్రాన్ని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అందుకున్నారు.

వైద్యశిబిరం

చంద్రుగొండ: మండలంలోని మద్దుకూరు గ్రామశివారు అటవీప్రాంతంలో ఉన్న మంగళ బోడు గొత్తికోయగూడెంలో బుధవారం ఎర్రగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఇంద్రధనుష్ కార్యక్రమంలో భాగంగా గొత్తికోయ పిల్లలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో ఏఎస్‌ఎంలు టి.సుశీల, పి.భవాని, ఎంఎల్‌హెచ్‌పీ హారిక, ఆశవర్కర్ రాములమ్మ పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

దుమ్ముగూడెం: మండలంలోని దుమ్ముగూడెం గ్రామంలో ఆర్లగూడెం ప్రభుత్వ ఆయుర్వేద డాక్టర్ ఉషారాణి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 70 మంది రోగులకు చికిత్స అందించారు. కీళ్ల నొప్పులు, గ్యాస్ట్రబుల్, అసిడిటీ, చర్మ వ్యాధులు, రక్తహీనత కోసం మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యేకు ధన్యవాదాలు

అశ్వారావుపేట: అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి ధన్యవాదాలు తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే కృషితో అశ్వారావుపేట సీహెచ్‌సీని 30 పడకల నుంచి 100 పడకలకు అప్‌గ్రేడ్ చేస్తూ మంగళవారం సీఎం కేసీఆర్ జీవోను జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల మంజూరయిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తాత్కాలికంగా నిర్వహిస్తారని, ఇందుకోసం విద్యార్థులు అడ్మిషన్లు పొందేందుకు దోస్త్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో మంజూరైన సెంటర్ లైటింగ్ పనులు మొదలయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బండి పుల్లారావు, జిల్లా అధికార పార్టీ ప్రతినిధి యూఎస్ ప్రకాశరావు, టౌన్ అధ్యక్షులు సత్యవరపు సంపూర్ణ, తాడేపల్లి రవి, చిప్పనపల్లి బజారయ్య, గుమ్మడవల్లి ఎంపీటీసీ తిరుపతిరావు, రామినేని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి

'గృహలక్ష్మి'కి దరఖాస్తుల వెల్లువ

అశ్వారావుపేటరూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సొంత ఇంటి స్థలాలు ఉన్న నిరుపేదల ఇళ్ల నిర్మాణాలకు ఆర్థిక సాయం అందించేందుకు ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు వెల్లువెత్తున్నాయి. గడిచిన రెండు రోజుల్లో(మంగళ, బుధవారాలు) మండలంలోని 30 గ్రామ పంచాయతీల నుంచి 1,688 మంది ఆయా కార్యదర్శులకు దరఖాస్తులు అందించారు. ఈ పథకం కింద దరఖాస్తులు పెట్టుకునేందుకు మరోక రోజు మాత్రం గడువు ఉండగా, దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్లు స్థానిక ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. డబుల్ బెడ్రూం ఇళ్లు అందరికీ దక్కకపోవడంతో గృహలక్ష్మిపై పేదలు గంపెడాశలతో ఉన్నారు.

గడువు పొడిగించాలి..

భద్రాచలంఅర్బన్: డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఎంతోమంది గృహలక్ష్మి పథకం కోసం ఎదురుచూస్తున్నారని, వారి కోసం ఈ నెల 30 వరకు గడువు పెంచాలని సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఎంబి.నర్సారెడ్డి కోరారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేవలం 3 లక్షల ఇస్తామని చెప్పి అదికూడా రెండు, మూడు రోజులే గడువు ఇవ్వడం సరికాదన్నారు. రేషన్ కార్డు, ఇంటిపన్ను లేని వారికి కూడా అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఎం. రేణుక, నాగరాజు, కన్వీనింగ్ కమిటీ సభ్యులు పారెల్లి సంతోష్, లక్ష్మణ్, అప్పారి రాము తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: గృహలక్ష్మి పథకం దరఖాస్తులకు గడువు పొడిగించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కుల, ఆదాయ, నివాస ధృవీకరణపత్రాలు లేకపోవడంతో రెండు రోజుల్లో దరఖాస్తులు చేసుకోవడానికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేసేలా ప్రక్రియ కొనసాగించాలని డిమాండ్ చేశారు.

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు గడువును ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించాలని కోరుతూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఎంపీడీఓ చంద్రమౌళికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కొడిశాల రాములు మాట్లాడారు. నాయకులు లెనిన్‌బాబు, మడి నరసింహారావు, నందం ఈశ్వర్‌రావు, గుర్రం నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: గృహలక్ష్మి దరఖాస్తు గడువును పెంచాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థికసాయమందించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు పున్నంచంద్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలను పార్టీ శ్రేణులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్ పార్టీ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీకి ఒక బలమైన ఆయుధంగా యూత్ కాంగ్రెస్ విభాగం ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా యూత్ కాంగ్రెస్ నాయకులు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సుధీర్, ప్రదీప్, నరేష్, శ్రీనివాసరెడ్డి, నాగసతీష్, నవాబ్, మణికంఠ, శ్యామ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి

గుండాల: పోస్టల్ శాఖలో వివిధ రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయని, ఆ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ రవికుమార్ అన్నారు. బుధవారం ఆళ్లపల్లి మండల కేంద్రంలో సబ్ పోస్ట్ ఆఫీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఆఫీస్ పరిధిలో 12 పోస్ట్ బ్రాంచ్‌లు ఉంటాయని తెలిపారు. బ్యాంకింగ్, ఇన్సురెన్సు, పొదుపు సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆజాద్ కా అమృత్ మహోత్సవంలో భాగంగా భారత ప్రభుత్వ తపాలా శాఖ ద్వారా జాతీయ జెండాలను ప్రతీ పోస్ట్ ఆఫీస్ నందు విక్రయిస్తున్నారని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న పోస్టల్ అధికారి రవికుమార్

హెచ్‌ఎంలకు సన్మానం



గొల్లగూడెం హెచ్‌ఎంను సన్మానిస్తున్న పీఓ

దమ్మపేట: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ప్రధానోపాధ్యాయులకు, భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ సన్మానం చేశారు. బుధవారం భద్రాచలం పట్టణంలోని గిరిజన భవన్‌లో, ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పది ఫలితాల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన గిరిజన ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పీఓ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని గొల్లగూడెం, అంకంపాలెం ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, వెంకటేశ్వర్లులను పీఓ శాలువాతో సత్కరించి, అభినందించారు. కార్యక్రమంలో ఏపీఓ డేవిడ్ రాజు, డీడీ మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగికి..

చంద్రుగొండ: మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో ఉద్యోగ విరమణ పొందిన అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ తన్నీరు వెంకటేశ్వరరావును జిల్లా అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ రంజిత్‌కుమార్ చౌదరి సన్మానించారు. స్థానిక సబ్‌పోస్టాఫీస్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో వెంకటేశ్వరరావు ఉద్యోగ కాలంలో చేసిన సేవలను ఆయన కొనియాడారు. కార్యక్రమంలో ఏఐజీడీఎస్ రాష్ట్ర కార్యదర్శి బండి జయరాజు, ఉపాధ్యక్షుడు పట్టాభిరామయ్య, తపాల సిబ్బంది గిరిశంకర్, సత్యనారాయణ, మణి, వీ అవినాష్, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌కు వినతి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగస్తుల సమస్యలపై ఈ నెల 13న ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న సమావేశం గురించి ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు బుధవారం ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ స్టేట్ యూనియన్ సభ్యులు మెమోరాండం అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రజనీకాంత్, జిల్లా నాయకులు కందుకూరి శ్రీనివాసరావు, విశ్వాస శ్రీనివాస్, బాల అశోక్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ



వాహన పత్రాలను పరిశీలిస్తున్న ఎస్సై శ్రీనివాస్

మణుగూరురూరల్: మణుగూరులోని హనుమాన్ టెంపుల్ పీవీకాలనీ క్రాస్ రోడ్డు వద్ద మణుగూరు ఎస్సై శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. తనిఖీలో భాగంగా మణుగూరు–భద్రాద్రి కొత్తగూడెం వైపు రాకపోకలు సాగిస్తున్న వాహనాలను నిలిపి సంబంధిత ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించని వారికి ఈ జరిమానా విధించారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ తనిఖీలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.